కండక్టర్ కోటేశ్వరమ్మకు సీఎం అభినందనలు



కండక్టర్ కోటేశ్వరమ్మను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తునందుకు టీఎస్‌ఆర్టీసీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ట్యాంక్‌బండ్ వద్ద శుక్రవారం వంద కొత్త బస్సులను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌లతో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీలో అత్యధిక ఆదాయం సమకూర్చిన ఆర్టీసీ సిబ్బందిని సీఎం అభినందించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపోకు చెందిన కోటేశ్వరమ్మకు సీఎం, డిప్యూటీ సీఎం బెస్ట్ ఈపీకే (ఎర్నింగ్ పర్ కిలోమీటర్) అవార్డు అందజేశారు. తమ డిపోకు చెందిన కోటేశ్వరమ్మ కిలో మీటరుకు రూ.93 ఆదాయం సమకూర్చడం గర్వకారణమని డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కోటేశ్వరమ్మను ఆదర్శంగా తీసుకొని సంస్థను లాభాల బాటలో నడిపించాలని డీఎం కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

కండక్టర్‌ను చెప్పుతో కొట్టిన మహిళ

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాను అడిగిన చోట ఆర్టీసీ బస్సు ఆపలేదని ఆగ్రహించిన ఓ మహిళ కండక్టర్‌పై చెప్పుతో కొట్టింది. ఈ సంఘటన శివరాంపల్లి వద్ద శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శివరాంపల్లికి చెందిన ప్రసన్న(35) శనివారం మెహిదీపట్నంకు చెందిన 300 నంబర్ బస్సును తాను నిలబడిన చోట ఆపమని చేయి చూపి అడిగింది. కానీ, డ్రైవర్ బస్సు ఆపలేదు. బస్టాప్‌లోకి వెళ్లి బస్సు ఆపారు. దీంతో ఆగ్రహించిన ప్రసన్న బస్టాప్‌లోకి వచ్చి బసున ఎక్కి కండక్టర్ నర్సింహతో గొడవపడింది. చెప్పు తీసుకుని కొట్టింది. ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి దర్యాప్తు చేస్తున్నారు.



సదస్సులో ప్రొ.డి.నరసింహారెడ్డి, నిపుణులు

దేశంలోని వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని న్యూ ఢిల్లీ మానవ అభివృద్ధి సంస్థ అధ్యాపకులు ప్రొ.డి.నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్- దక్షిణ భారత దేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు- మూల్యాంకనం" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును వర్సిటీలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని, రెండు దశాబ్దాల క్రితం దేశ జీడీపీ వృద్ధిలో వ్యవసాయరంగం ఉత్పత్తులు 52 శాతం ఉండగా ప్రస్తుతం 18శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముంబై ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ మాజీ డైరెక్టర్, ఉప కులపతి ప్రొ.ఎస్.మహేంద్రదేవ్ మాట్లాడుతూ "భారతదేశం 100 అవకాశాలు- సమస్యలు- ఆర్థికాభివృద్ధికి సూచనలు" అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థికాభివృద్ధికి చేసిన సూచనలు, సేవలకు గాను ప్రఖ్యాత ఆర్థిక వేత్త, కేంద్ర ప్రణాళికాసంఘం మాజీ సభ్యులు ప్రొఫెసర్ సి.హెచ్.హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్రాల విభాగ మాజీ డీన్ ప్రొ.టి.జ్యోతి రాణి ప్రొ.జయశంకర్, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.కె.ముత్యం రెడ్డి, కార్యదర్శి డా.బి.వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్రం విభాగం అధిపతి డా.కె.కృష్ణా రెడ్డి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ ప్రొ.రేవ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సౌరశక్తి వినియోగం



సోలార్ మీట్‌ను ప్రారంభించిన టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సౌరశక్తి వినియోగం పెరుగుతుందని, సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులకు అనేక లాభాలున్నాయని టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య అన్నారు. గ్రీన్‌టెక్ ఇండియా, అదానీ సోలార్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో పార్టనర్స్ మీట్-2024ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. అదానీ సోలార్ మార్కెటింగ్ హెడ్ సెసిల్ అగస్టీన్ మాట్లాడుతూ తొలిసారి 570 వాట్ల సోలార్ ప్యానెల్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ టెక్ ఇండియా వ్యవస్థాపకుడు సత్య కిరణ్ గన్నారపు, అదానీ సోలార్ సంస్థ ప్రతినిధి ప్రశాంత్, తెలంగాణ రాష్ట్రంలోని పలువురు సోలార్ డీలర్లు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.శంకర్ ఆరోపించారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాయింట్ రీజినల్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ఏఐయూబీఈఏ కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సును ప్రారంభించిన అనంతరం శంకర్ మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి కేంద్రప్రభుత్వం బ్యాంకుల విలీనం చేపట్టిందన్నారు. ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకరణ వల్ల కార్మికులు ఉద్యోగభద్రత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో యూనియన్ బ్యాంకు హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్‌మేనేజర్ కె.భాస్కర్‌రావు, జనరల్ మేనేజర్ కృష్ణన్, యూనియన్‌బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల బదిలీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. సికింద్రాబాద్ ఆర్డీఓ కారాల్యయంలో డీఏఓగా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను నల్లగొండ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే అంబర్‌పేట్ తహసీల్దార్ భిక్షపతిని, కలెక్టరేట్‌లోని అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ)లో స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నర్సయ్యను సంగారెడ్డి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేశారు.

పోలీసులపై దుర్భాషలాడుతూ పోస్టు

● నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసులు వేసిన చలానా తప్పుగా ఉందని పోలీసులను దుర్భాషలాడుతూ రిపోర్ట్ యాజ్ యాప్‌లో పోస్టు పెట్టిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. చాంద్రాయణగుట్టకు చెందిన ముస్తఫాఅహ్మద్ ట్రాఫిక్ ఈ చలానాల ఫిర్యాదు కోసం నిర్వహించే రిపోర్ట్ యాజ్ యాప్‌లో తన హీరో గ్లామర్ వాహనా.. నికి చెందిన ఓ చలానాను అప్‌లోడ్ చేశాడు. అనంతరం ఇది తప్పుడు చలానా పోలీసులు కళ్లు మూసుకొని పనిచేస్తున్నారా అంటూ ప్రశ్నించాడు. హిందీలో దుర్బాషలాడుతూ పోస్టు పెట్టాడు. యాప్ నిర్వహిస్తున్న సిబ్బంది చలానా అసలైన వాహనానికే వేసినట్టు నిర్ధారించారు. విధుల్లో ఉన్న పోలీసులను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించడంతో పాటు దుర్బాషలాడినందుకు ట్రాఫిక్ ఈ-చలాన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ముస్తఫా అహ్మద్‌పై 504, 506, 509, 186, 189 ఐపీసీతో పాటు ఐటీ సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బంధు, రుణమాఫీ అమలులో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బహిరంగ సభలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు మాత్రమే అమలు చేసి, నాలుగు గ్యారంటీలపై చేతులెత్తేసిందని విమర్శించారు. రైతుబంధు, రుణమాఫీ ఇవ్వడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం అయ్యారని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు పూర్తిగా తెలంగాణ ప్రజలకు చెందేలా ప్రభుత్వం కృషి చేయాలని ఎమ్మెల్యే గోపాల్ డిమాండ్ చేశారు. ఛలో నల్గొండ బహిరంగ సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలి వెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠాజైసింహ, డివిజన్ల అధ్యక్షులు ఎం.రాకేష్‌కుమార్, వై.శ్రీనివాస్‌రావు, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, కొండ శ్రీధర్‌రెడ్డి, నాయకులు ముచ్చకుర్తిప్రభాకర్, శంకర్ ముదిరాజ్, డేవిడ్‌రాజ్, ఆకుల అరుణ్‌కుమార్, కె.సురేందర్, సాయికుమార్, శ్రీకాంత్, మహ్మద్ జహంగీర్, డి.రవియాదవ్, ముఠా నరేష్, అరుణ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం బర్కత్‌పురలోని నగర పార్టీ కార్యాలయంలో బస్తీ బాటపై సమీక్ష నిర్వహించారు. అన్ని పోలింగ్ బూత్‌లలో బస్తీబాట నిర్వహించి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఇంటింటికీ తీసుకెళ్లామని గౌతమ్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీ సాధించి మోదీ హ్యాట్రిక్ సాధిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, నియోజకవర్గం కన్వీనర్ శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ గృహజ్యోతి వర్తింపజేయాలి

● బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్

అంబర్‌పేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకాన్ని పేదలందరికీ వర్తింపజేయాలని బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.యశ్వంత్ డిమాండ్ చేశారు. శనివారం అంబర్‌పేటలో గృహలక్ష్మి దరఖాస్తుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. తెల్లరేషన్ కార్డులు ఉన్న వారి దరఖాస్తులు మాత్రమే తీసుకుంటున్నారని, రేషన్‌కార్డు లేని నిరుపేదలందరి దరఖాస్తులు దరఖాస్తులు తీసుకుని గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు అందించాలని కోరారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తుల అందజేత

గోల్నాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా 200 యూనిట్ల ఫ్రీ విద్యుత్‌కు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. శనివారం గోల్నాక డివిజన్ గంగానగర్ కమ్యూనిటీ హాల్‌లో విద్యుత్ అధికారి సంతోష్‌కు దరఖాస్తులు అందజేశారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కరెంట్ బిల్లు జిరాక్స్ కాపీలతో ప్రభుత్వం ఇస్తున్న దరఖాస్తును పూర్తి చేసి అధికారికి ఇచ్చారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందారు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం... 60ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి డబీర్‌పుర - మలక్‌పేట రైల్వే స్టేషన్ల నడుమ పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని శరీరంపై లైట్ పింక్ కలర్ ఫుల్‌షర్ట్, నలుపు రంగు ప్యాంటు ఉంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

దాడి కేసులో నిందితుడికి 14 రోజుల జైలు

డబ్బులు ఇవ్వనందుకు ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన నిందితుడికి నాంపల్లి కోర్టు 14 రోజుల జైలు శిక్ష విధించింది. కాచిగూడ సీఐ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్ గఫార్ నింబోలి అడ్డాలో ఫుట్‌పాత్‌పై టీస్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం కాచిగూడకు చెందిన ఆటో డ్రైవర్ సాయి కుమార్(32) టీస్టాల్ వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని లేకపోతే టీస్టాల్‌ను ఫుట్‌పాత్‌పై నుంచి తీసివేయాలని బెదిరించాడు. అబ్దుల్ గఫార్ డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆటో డ్రైవర్.. టీస్టాల్ యజమానిపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన కాచిగూడ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి నాంపల్లి మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఆటో డ్రైవర్ సాయికుమార్‌కు 14 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

రాంనగర్/చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పలు ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం), కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, జూలకంటి రంగారెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్, సీపీఐ ఎంఎల్ పార్టీ నాయకుడు కె.గోవర్ధన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం మద్దతు ధర గ్యారంటీ చేసే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణ మాఫీ చేయాలన్నారు. గ్రామీణ భారత్‌బంద్, సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు.

సెమీస్‌లో చంద్రశేఖర్ జోడి

● హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ



సెమీస్‌లో గెలుపొందిన చంద్రశేఖర్ జోడి

హైదరాబాద్ క్రీడా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 16వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఐపీఎస్ చంద్రశేఖరరెడ్డి, లగడపాటి శ్రీధర్ జోడి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మెన్స్ 50 ప్లస్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్ 8- 5 స్కోరుతో కృష్ణారెడ్డి, ఆదిశేషలపై విజయం సాధించారు. 50 ప్లస్ సింగిల్స్ విభాగం క్వార్టర్‌ఫైనల్లో సీవీ ఆనంద్ 8-2 స్కోరుతో చంద్రశేఖర్‌పై విజయం సాధించారు. పురుషుల డబుల్స్ 50 ప్లస్ విభాగం క్వార్టర్ ఫైనల్లో వహీద్, నంద్యాల జోడి 8-4 స్కోరుతో శ్రీనివాస్, ప్రసన్నలపై విజయం సాధించారు. 40 ప్లస్ డబుల్స్ విభాగంలో విజయ్‌వర్మ, వెంకట సాయిలు 8-2 స్కోరుతో సతీశ్, ముతులపై విజయం సాధించారు. పురుషుల 30 ప్లస్ సింగిల్స్‌లో సూర్య పవన్ 8-3తో ఈశ్వర్‌పై, అంకేశ్ 8-6తో సురేశ్‌రెడ్డిపై పైచేయి సాధించి సెమీస్‌కు చేరారు. 40 ప్లస్ సింగిల్స్‌లో బోస్ కిరణ్ 8-3తో సురేశ్ ముతుపై గెలుపొందగా, రాజ 8-1తో శ్రీనివాస కుమార్‌ను ఓడించాడు. 60 ప్లస్ సింగిల్స్‌లో వెంకటేశ్‌పై 8-3తో రామ్‌రెడ్డి, సోమ శేఖర్‌పై 8-3తో మధుకర్ గెలుపొందారు. ఏఆర్‌రావు, గజపతి 70 ప్లస్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో విజయాలు నమోదు చేశారు. 70 ప్లస్ డబుల్స్‌లో సాయి రాంబాబు, మదన్ మోహన్ జోడి, మధుసూదన్, రవిమోహన్ జోడి సైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.

పీవీకి 'భారతరత్న'.. తెలుగు ప్రజలకు గర్వకారణం



పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు భారతరత్న అవార్డు రావడం తెలుగు ప్రజలకు గర్వకారణం అని బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, నగర మాజీ కార్యవర్గ సభ్యులు కౌండిన్యప్రసాద్ పేర్కొన్నారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో రాంనగర్ గుండూ చౌరస్తాలో పీ.వీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పీవీ సేవలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, ప్రధాని మోదీ ఆయన సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించడం శుభపరిణామం అన్నారు.

తెలుగు బిడ్డకు దక్కిన అత్యున్నత పురస్కారం: గీతామూర్తి

బర్కత్‌పుర, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి పీవీ.నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తించని కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కెగీతామూర్తి పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలో ఆమె మట్లాడుతూ పీవీకి భారతరత్న ఇవ్వడం తెలుగు బిడ్డకు దక్కిన అత్యున్నత పురస్కారమని ఆమె కొనియాడారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పీవీ తీసుకువచ్చిన సంస్కరణలు ఎంతో దోహదపడ్డాయన్నారు.

పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ హర్షం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, తన తండ్రికి భారత రత్న అవార్డు ప్రకటించడంపట్ల పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్, పీవీ తనయుడు పీవీ ప్రభాకరావు హర్షం వ్యక్తంచేశారు. ఆరు దశాబ్దాలుగా ప్రజాసేవకు అచంచలమైన అంకితభావంతో దేశానికి పీవీ చేసిన అసమానమైన సేవలకు నిదర్శనం అని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు బహుభాషావేత్త, దౌత్యవేత్త కూడా అన్నారు. పీవీ జయంత్యుత్సవాల సందర్భంగా ఆయన పేరును భారతరత్నకు సిఫార్సు చేయాలని శాసనసభలో ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించడంలో కీలకపాత్ర పోషించినందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రభాకరావు కృతజ్ఞతలు తెలిపారు.

సికింద్రాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడిగా గోవిందరావు

● ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా వరుణ్



గోవిందరావుకు నియామకపత్రం అందజేస్తున్న అనిల్‌యాదవ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా సమాజసేవకుడు, సినీ నటుడు డాక్టర్ సి. వెంకటగోవిందరావు నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు అనిల్‌యాదవ్ శనివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఆల్ ఇండియా సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా చిక్కడపల్లికి చెందిన కెప్టెన్ ఆకెళ్ళ వరుణ్‌రాహుల్ నియమితులయ్యారు. ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ జాతీయ చీఫ్ ఆర్గనైజర్ జారీ చేసిన నియామక పత్రాన్ని తెలంగాణ యాక్టింగ్ ఆర్గనైజర్ జితేందర్ అందజేశారు.

మానవ హక్కుల సంరక్షణ సంఘం ముషీరాబాద్ అధ్యక్షుడిగా సత్యం

మానవహక్కుల సంరక్షణ సంఘం ముషీరాబాద్ అధ్యక్షుడిగా గాంధీనగర్ డివిజన్‌కు చెందిన దోనేటి సత్యం ఎన్నికయ్యారు. సంఘం ప్రధానకార్యాలయంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం శివానంద్ శనివారం అందజేశారు.

కుష్టు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

● కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లో ఉంటున్న ప్రజలు కుష్టు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా శనివారం అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో నిర్మలా ప్రభావతి, పారామెడికల్ అధికారి వనిత, డిప్యూటీ పారామెడికల్ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బీమామైదాన్ బస్తీ దవాఖానాలో వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళ్లల్లో తిమ్మిర్లు, నరాలు ఉబ్బడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించి జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం బారినపడకుండా ఉండవచ్చని అన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

● కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో వున్న అభివృద్ధిపనులను వెంటనే పూర్తిచేయాలని డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనీ వినయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో పెండింగ్ అభివృద్ధి పనుల విషయమై జీహెచ్ఎంసీ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్‌తో కార్పొరేటర్ సమీక్షించారు.

ఘనంగా 'మహాగతే ఫౌండేషన్' ట్రస్ట్ వార్షికోత్సవం



మహాభారతం అన్‌రావేల్డ్ - 2 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహాగతే ఫౌండేషన్ పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ 8వ వార్షికోత్సవం శనివారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో నిర్వహించారు. అమీగణత్ర రచించిన మహాభారతం అన్‌రావేల్డ్ - 2 పుస్తకాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మహాగతే ఫౌండేషన్ గురువు శ్రీతమహాగత ఆవిష్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు సంధ్య వల్లూ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ యువకులు, చిన్నారుల కోసం యువ చేతన, బాల చేతన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనాథలు, వృద్ధులను ఆదుకోవడం, గోవులను సంరక్షించడం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ పవన్ వల్లూరి, కార్యదర్శి సాయికుమార్, ఇందిరా పల్లవి, పంకజ్ సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం మోహన్‌నగర్ దళిత జాతీయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నూతన అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే ముఠాగోపాల్ నేతృత్వంలో ముషీరాబాద్ నియోజక వర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, దళిత జాతీయ సంఘం నాయకులు కత్తి నర్సింగ్‌రావు, ఎల్లయ్య, సంఘం మాజీ చైర్మన్ నర్సింగ్‌రావు, నేత భాస్కర్, సత్యనారాయణబాబు, సురేష్, గజ్జల రాజశేఖర్, శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.

ఏబీఎన్- ఆంధ్రజ్యోతి న్యూస్ ప్రజెంటర్‌కు ప్రతిభాపురస్కారం



నవీన్‌కుమార్‌కు ప్రతిభాపురస్కారం ప్రదానం చేస్తున్న రామలింగేశ్వరరావు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్‌చానల్ ఏబీఎన్- ఆంధ్రజ్యోతి న్యూస్ ప్రజెంటర్ ఎం.నవీన్‌కుమార్‌కు ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆరాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ఆరాధన న్యూస్ ప్రజెంటర్ ప్రతిభాపురస్కారాల ప్రదా న సభ నిర్వహించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక కార్యక్రమాలతో టీవీలు నిర్వహిస్తున్న డిబేట్‌లు ఇతర కార్యక్రమాలు ఆకట్టుకునేలా ఉంటాయని, ప్రజలను ఆలోచింపచేస్తాయన్నారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, హనుమంతరావు, చిల్ల రాజశేఖర్‌రెడ్డి, లంక లక్ష్మీనారాయణ, సంస్థ వ్యవస్థాపకులు లోకం కృష్ణయ్య పాల్గొన్నారు.

బడ్జెట్‌పై హర్షం

రాష్ట్ర ప్రభుత్వం శనివారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన రూ.3లక్షల కోట్ల బడ్జెట్‌పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలు భిన్నాభిప్రాయం వ్యక్తంచేశారు. బడ్జెట్‌పై మిశ్రమ సందన వచ్చింది. అధికార కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేయగా, ప్రతిపక్ష పార్టీలు అంకెల గారడీగా వారు అభివర్ణించారు. బడ్జెట్‌పై వివిధ పార్టీలు, విద్యావేత్తలు, అభిప్రాయాలు వారి మాటల్లో...

-(ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం)


ఆరు గ్యారంటీల అమలుకు నిధుల కేటాయింపు



ఆర్థిక మంత్రి భట్టివిక్కమార్క ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలు అమలు చేసేలా కేటాయింపులు ఉన్నాయి. పేద ప్రజలసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, విద్య, వైద్య, వ్యవసాయ, పరిశ్రమరంగ అభివృద్ధికి దోహదపడే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేయడం మంచి పరిణామం. సీఎం రేవంత్‌రెడ్డి, ఇచ్చిన మాట ప్రకారం వందరోజుల్లో ఆరు గ్యారంటీల అమలు కోసమే బడ్జెట్ కేటాయింపు.

-వరదరాజు, సికింద్రాబాద్‌జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు

ఆరోగ్యశ్రీకి నిధుల పెంపు అభినందనీయం



బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి నిధులు కేటాయించడం అభినందనీయం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభపరిణామం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఆరోగ్యశ్రీ పరిధిని రూ. 10లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత ఫ్రీ బస్సు తదితర వాటి కోసం బడ్జెట్‌లో రూ.11.500 కోట్లు కేటాయించారు.

-డాక్టర్ ఏ. సుధాకర్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి,


ఆరు గ్యారెంటీలకు ప్రాధాన్యం కల్పించారు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంది. ఆరు గ్యారెంటీలకు ప్రాధాన్యం కల్పిస్తూ రూ. 53వేల కోట్లకుపైగా నిధులు కేటాయించడం మంచి పరిణామం. నగరాభివృద్ధి, రైతుల రుణ మాఫీపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే బాగుంటుంది.

- ఉప్పాల మధుసూదన్‌రావు, సప్తగిరికాలనీ

వైద్యరంగానికి ప్రాధాన్యం



రాష్ట్రంలోని పేదలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో లేవు. వైద్య రంగాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవడం శుభపరిణామం. వైద్య రంగానికి రూ.11వేల కోట్లు కేటాయించడం హర్షించ దగ్గ విషయం. పేదలకు ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డుల జారీపై దృష్టి సారించి... సకాలంలో పేదలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేయాలి.

- పీవీ రమణరావు, వివేకానందనగర్‌కాలనీ

తెలంగాణ పునర్నిర్మాణానికి బాటలు



అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణ పునర్నిర్మాణానికి బాటలు వేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్లలో అప్పుల రాష్ట్రంగా బీఆర్ఎస్ పార్టీ మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టేందుకు బడ్జెట్ దోహదపడనుంది. ఆరు గ్యారెంటీల అమలుకు రూ. 53వేల కోట్ల కేటాయింపు హర్షనీయం. బడ్జెట్‌తో కాంగ్రెస్ మార్కు పాలన సుస్పష్టం అవుతోంది.

- బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి

మహిళా సంక్షేమానికి పెద్దపీట



బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారు. సబ్సిడీ గ్యాస్‌ను అందించి మహిళలకు గృహభారాన్ని తగ్గించబోతున్నారు. ఆరోగ్యశ్రీతోపాటు మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకాలు ప్రకటించి మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలువేశారు.

- శంభుల ఉషశ్రీ, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు



కార్యక్రమంలో ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్వీర్ కార్నివాల్

రాయదుర్గం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎల్జీబీటీక్యూఐఏ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్, క్వీర్, ఇంటర్ సెక్స్, అసెక్సువల్) కమ్యూనిటీ ఆధ్వర్యంలో క్వీర్ కార్నివాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని, రచయిత, దర్శకుడు సాంటో మోహన్ వీరాంకి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ సమస్యలపై రాసిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. సొసైటీ ట్రాన్స్‌జెండర్స్‌ను చిన్నచూపు చూస్తోందని, అందరితో సమానంగా చూసే దృక్పథాన్ని ప్రజలు అలవర్చుకోవాలని అమల సూచించారు.

ట్రాన్స్‌జెండర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీర్లు కూడా ఉన్నారని, వారిని మరింత ప్రోత్సహించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన నృత్యప్రదర్శన, ఫ్యాషన్‌షో ఆకట్టుకున్నాయి.